సాక్షి
కుమురం భీం

శుక్రవారం। 19। ఏప్రిల్। 2024



మండుతున్న ఓసీపీలు

రోజురోజుకూ పెరుగుతున్న ఎండలతో సింగరేణి ఓసీపీలు మండుతున్నాయి. భానుడి భగభగతో ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో కార్మికులు వేడికి అల్లాడుతున్నారు. 8లో▸



'వేలం' లేనట్లేనా..?

ఏటా మార్చి మొదటి వారంలోనే తైబజార్‌ల వేలం నిర్వహిస్తారు. దహెగాం వారసంత గడువు పూర్తయ్యి నెలరోజులు కావస్తున్నా ఇంకా వేలం వేయడం లేదు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
42.9 /28.9

వాతావరణం

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉదయం నుంచే వేడి అధికంగా ఉంటుంది. రాత్రి కూడా ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో తాగునీటి వసతి



వాటర్‌ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ఆసిఫాబాద్‌: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ ఆవరణలో తాగునీటికోసం వాటర్‌ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే తెలిపారు. గురువారం అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారితో కలిసి వాటర్‌ ప్లాంట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా కార్యాలయానికి వచ్చే ప్రజల కోసం తాగునీటి వసతి కల్పించినట్లు తెలిపారు.

మే 10లోగా ఏర్పాట్లు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఆసిఫాబాద్‌రూరల్‌: లోక్‌ సభ ఎన్నికల్లో భాగంగా జిల్లాలోని పోలింగ్‌ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉండేలా ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్‌ దీపక్‌ తివారీ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పోలింగ్‌ కేంద్రాలు ఏర్పాటు చేసినందువల్ల యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించి మే 10వ తేదీలోగా పూర్తి చేసేలా చూడాలన్నారు. మే 13న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో విధులు నిర్వహించనున్న సిబ్బందికి, ప్రజలకు ఎండ తగలకుండా అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. పోలింగ్‌ కేంద్రాల్లో కరెంట్‌, ఫ్యాన్లు, తాగునీరు, టాయిలెట్లు, ర్యాంపులు, ఇతరత్రా సౌకర్యాలు కల్పించాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ ప్రచార రథాలు ప్రారంభం



ప్రారంభిస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

కాగజ్‌నగర్‌ రూరల్‌: పార్లమెంట్‌ ఎన్నికల్లో భాగంగా సిర్పూర్‌ నియోజకవర్గంలో గురువారం ఇన్‌చార్జి జెడ్పీచైర్మన్‌ కోనేరు కృష్ణారావు, కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్‌, సిడాం గణపతి జెండా ఊపి కాంగ్రెస్‌ పార్టీ ప్రచార రథాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ విజయకేతనం ఎగురవేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కోఆప్షన్‌ సభ్యుడు బాబా, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు వార్ల తిరుపతి, జిల్లా ఓబీసీ నాయకులు ఎమ్మాజీ సంతోశ్‌, నాయకులు రాంబాబు, ప్రసాద్‌ పాల్గొన్నారు.

'అసత్యపు ఆరోపణలు మానుకోవాలి'



మాట్లాడుతున్న రావి శ్రీనివాస్‌

కాగజ్‌నగర్‌ రూరల్‌: సిర్పూర్‌ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు కాంగ్రెస్‌ పార్టీ నాయకులపై అసత్యపు ఆరోపణలు మానుకోవాలని, ప్రజల్లో కాంగ్రెస్‌కు పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్‌ పార్టీ సిర్పూర్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్‌ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లక్కీలో గెలిచిన ఎమ్మెల్యే హరీశ్‌బాబు ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలు నెరవేర్చే ప్రయత్నం చేయాలని హితవు పలికారు. అసత్యపు ఆరోపణలు చేసిన ఎమ్మెల్యేపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఆరోపణలు నిర్ధారించని పక్షంలో బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదంటే పరువు నష్టం కేసు వేస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ దస్తగీర్‌, బ్లాక్‌ కాంగ్రెస్‌ నాయకులు వార్ల తిరుపతి, ప్రసాద్‌, రాము, తదితరులు పాల్గొన్నారు.

చక్కదిద్దుతారా?



రేవంత్‌రెడ్డి, ముఖ్యమంత్రి



విష్ణుదేవ్‌సాయి, ఛత్తీస్‌గఢ్‌ సీఎం

- నామినేషన్‌కు అభ్యర్థులు సిద్ధం
- 22న కాంగ్రెస్‌ అభ్యర్థి సుగుణ..
- 24న బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్‌..
- ఇదేరోజు బీజేపీ రెబెల్‌గా సోయం?
- ప్రధాన పార్టీల్లో ఆగని అలకలు
- ముఖ్యనేతల రాకతోనైనా వీడేనా?



కేసీఆర్‌ చేతుల మీదుగా బీ ఫాం అందుకుంటున్న ఆత్రం సక్కు

సాక్షి, ఆదిలాబాద్‌: ప్రధాన పార్టీల ఎంపీ అభ్యర్థులు ఖరారై రోజులు గడిచాయి. కాంగ్రెస్‌, బీజేపీ నుంచి టికెట్‌ ఆశించి దక్కని నేతలు అలక బూనారు. కొందరు పార్టీ కూడా మారారు. నామినేషన్‌ ప్రక్రియ మొదలైంది. భంగపడ్డ నేతలు పార్టీకి వ్యతిరేకంగా అడుగు వేస్తారా? కలిసి నడుస్తారా? అనేది కొద్దిరోజుల్లోనే తేలనుంది. ఇక టికెట్‌ దక్కించుకున్న అభ్యర్థులు నామినేషన్‌ వేసేందుకు రెడీ అవుతున్నారు.

'హస్తం' నేతలు అలక వీడేదెప్పుడో!

ఆదిలాబాద్‌ పార్లమెంట్‌ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే అసెంబ్లీ నియోజకవర్గాల్లోని బీఆర్‌ఎస్‌ ముఖ్యనేతలు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో దాదాపు అన్ని నియోజకవర్గాల్లో హస్తం నాయకత్వం కనిపిస్తోంది. తాజాగా మాజీ ఎంపీ సముద్రాల వేణుగోపాలాచారి, బోథ్‌ మాజీ ఎమ్మెల్యే రాథోడ్‌ బాపురావు కాంగ్రెస్‌ కండువా కప్పుకొన్నారు. కాగా, టిక్కెట్‌ ఆశించిన భంగపడ్డ మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్‌, ఏఐసీసీ సభ్యుడు నరేశ్‌జాదవ్‌ ఇంకా ఎక్కడా ప్రచారంలో పాల్గొనడంలేదు. ఈనెల 22న కాంగ్రెస్‌ అభ్యర్థి ఆత్రం సుగుణ నామినేషన్‌ వేయనున్నారు. ఇదేరోజు సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఆదిలాబాద్‌ పర్యటనకు రానున్నారు. జిల్లా కేంద్రంలోని డైట్‌ మైదానంలో బహిరంగసభకు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్య నేతలతో సీఎం సమావేశం కానుండగా, అప్పటికైనా నేతలు అలక వీడుతారో.. లేదో వేచి చూడాలి.

కమలంలో 'తిరుగుబాటు' తప్పదా?

బీజేపీ గోడం నగేశ్‌కు టికెట్‌ ఇచ్చిన తర్వాత పార్టీలో అసమ్మతి చోటుచేసుకుంది. ఆశావహుల్లో అసంతృప్తి నెలకొన్న విషయం తెలిసిందే. తాజాగా బోథ్‌ మాజీ ఎమ్మెల్యే రాథోడ్‌ బాపురావు కాంగ్రెస్‌లో, జెడ్పీ చైర్మన్‌ రాథోడ్‌ జనార్దన్‌ తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరారు. మాజీ ఎంపీ రాథోడ్‌ రమేశ్‌ సైలెంట్‌గా ఉన్నారు. కాగా, ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్‌ ఈనెల 24న నామినేషన్‌ వేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌ సీఎం విష్ణుదేవ్‌సాయి ఆరోజు ఆదిలాబాద్‌కు రానున్నారు. పార్టీ టికెట్‌ ఆశించిన సిట్టింగ్‌ ఎంపీ సోయం బాపూరావుకు పార్టీలో నిరాశ ఎదురు కాగా బీజేపీ రెబెల్‌గా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. 24న ఆయన కూడా నామినేషన్‌ వేయనున్నట్లు తెలుస్తోంది.

బీఆర్‌ఎస్‌ బీ–ఫాం అందుకున్న సక్కు

బీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా ఆత్రం సక్కు పేరు ఖరారై చాలా రోజులైంది. ఓ దశలో అభ్యర్థిని మార్చుతారనే ప్రచారం జరిగింది. ఈ పరిస్థితుల్లో కొంత గందరగోళం కనిపించింది. రెండ్రోజుల క్రితం మాజీ మంత్రి కేటీఆర్‌ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొనగా అభ్యర్థి మార్పు లేదని స్పష్టమైంది. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ సీఎం కేసీఆర్‌ చేతుల మీదుగా ఆత్రం సక్కు బీ–ఫాం అందుకున్నారు. ఈ నెల 23న లేదా 24న ఆయన నామినేషన్‌ వేయనున్నట్లు సమాచారం.



నామినేషన్‌ వేస్తున్న స్వతంత్ర అభ్యర్థి రాథోడ్‌ సుభాష్‌



నామినేషన్‌ వేస్తున్న ఆధార్‌ పార్టీ అభ్యర్థి శ్యాంలాల్‌

ఎన్నికల నోటిఫికేషన్‌ విడుదల

- తొలిరోజు రెండు నామినేషన్లు దాఖలు

కైలాస్‌నగర్‌: పార్లమెంట్‌ ఎన్నికలకు సంబంధించి గురువారం నోటిఫికేషన్‌ విడుదలైంది. ఉదయం 11గంటలకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ రాజర్షిషా నోటిఫికేషన్‌ జారీ చేశారు. ఈ నెల 25వ తేదీ వరకు కొనసాగనున్న నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారం మొదలైంది. తొలిరోజు ఆదిలాబాద్‌ జిల్లా ఇచ్చోడ మండలం జామిడి గ్రామానికి చెందిన రాథోడ్‌ సుభాష్‌ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్‌ దాఖలు చేశారు. అలాగే అలయెన్స్‌ ఆఫ్‌ డెమోక్రటిక్‌ రిఫార్మ్స్‌ (ఆధార్‌) పార్టీ తరఫున ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం గంగాదేవిపాడు గ్రామానికి చెందిన మాలోత్‌ శ్యామ్‌లాల్‌నాయక్‌ నామినేషన్‌ వేశారు. వీరు సాదాసీదాగా అనుచరులతో వచ్చి కలెక్టరేట్‌లోని కలెక్టర్‌ ఛాంబర్‌లో ఎన్నికల రిటర్నింగ్‌ అధికారికి నామినేషన్‌ పత్రాలు అందజేశారు.

పకడ్బందీ బందోబస్తు

నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా పోలీసులు పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వంద మీటర్ల పరిధి వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉండగా కలెక్టరేట్‌కు వెళ్లే రోడ్డుమార్గాన్ని మూసివేసి ట్రాఫిక్‌ను మళ్లించారు. అభ్యర్థుల వాహనాలు క్షుణ్ణంగా తనిఖీ చేసి ఐదుగురినే లోనికి అనుమతించారు. గడవు ముగిసేవరకూ ముగ్గురు సీఐ లు అక్కడే విధులు నిర్వహించారు. ఆదిలా బాద్‌ డీఎస్పీ జీవన్‌రెడ్డి బందోబస్తును పరిశీ లించి పలు సూచనలు చేశారు. మీడియా సెంటర్‌ను వద్ద వంద మీటర్ల పరిధిలో ఏర్పాటు చేశారు.

వయోజన విద్యకు శ్రీకారం



- నవభారత్‌ సాక్షరతా పేరుతో నూతన కార్యక్రమం
- అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్వహణ
- పార్లమెంట్‌ ఎన్నికల తర్వాత అమలు

ఆసిఫాబాద్‌అర్బన్‌: వయోజనులైన నిరక్షరాస్యుల్లో అక్షర వెలుగులు నింపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. ఎన్‌ఐఎల్‌పీ (న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం) పేరుతో మళ్లీ వయోజన విద్య కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నాయి. పార్లమెంట్‌ ఎన్నికల తర్వాత విద్యాశాఖ సమన్వయంతో అమలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి..

వయోజన విద్య కార్యక్రమ నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు కేటాయించాలని నిర్ణయించాయి. ఈ మేరకు వయోజన విద్య, విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు రావడంతో కార్యాచరణ రూపొందించారు. గతంలో కలెక్టర్‌తో పాటు వయోజన విద్య డెప్యూటీ డైరెక్టర్‌కు చెక్‌ పవర్‌ ఉండగా ప్రస్తుతం కలెక్టర్‌, డీఈవో పేరున బ్యాంక్‌ ఖాతాలు తెరిచేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో అధికారుల లెక్కల ప్రకారం 90,828 మంది నిరక్షరాస్యులు ఉన్నారు. వీరిలో మొదటి విడత కింద ఈ ఏడాది 14,979 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ముందుగా చదవడం, రాయడం, చిన్నచిన్న లెక్కలు చేయడం నేర్పించనున్నారు. అనంతరం క్రిటికల్‌ లైఫ్‌ స్కిల్స్‌లో ఫోన్‌ వినియోగం, డిజిటల్‌ లిటరసీ నేర్పించనున్నారు. ఒకేషనల్‌ స్కిల్స్‌ ద్వారా అక్షరాస్యతతో పాటు ఆర్థిక వనరులను పొందేందుకు మార్గాలను సూచించుట, ఫౌండేషన్‌ స్కిల్స్‌ నేర్చుకొన్న వారికి ప్రాథమిక విద్య ఆపై వాటిని నేషనల్‌ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ ఓపెన్‌ స్కూల్స్‌ ద్వారా సేకరించి ధ్రువీకరణపత్రం అందజేయనున్నారు. కార్యక్రమం నిర్వహణలో భాగంగా గ్రామ స్థాయిలో హెచ్‌ఎంలు సూపర్‌వైజర్‌గా, ఒక ఉపాధ్యాయుడు టీచర్‌గా, మరో ఉపాధ్యాయుడు సర్వేయర్‌గా విధులు నిర్వహించనున్నారు. ఎప్పటికప్పుడు ఉల్లాస్‌ యాప్‌లో నమోదు చేయనున్నారు.

వలంటీర్లతో బోధన..

న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం ద్వారా 15 నుంచి 50 ఏళ్లలోపు నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు చదువు నేర్పనున్నారు. గతంలో సాక్షర భారత్‌ పథకం కింద సమన్వయకర్తలు చదువు చెప్పేవారు. కొత్తగా చేపట్టే కార్యక్రమంలో వలంటీర్లను నియమిస్తారు. వీరికి శిక్షణ సామగ్రి అందజేయనున్నారు. 2027 వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది.

ఆదేశాలు అమలు చేస్తాం



నవభారత్‌ సాక్షరత కార్యక్రమానికి సంబంధించి ఆదేశాలు వచ్చాయి. ఇంతలో ఎన్నికల కోడ్‌ వచ్చింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మొదటి విడతలో 15 నుంచి 30 ఏళ్లలోపు వారికి చదువు నేర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– వంగల నాగరాజు, వయోజన విద్య ఏపీవో

పరీక్ష ఫీజు చెల్లించండి

కాగజ్‌నగర్‌ రూరల్‌: డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ ఓపెన్‌ యూనివర్సిటీలో 2018–23 మధ్యలో డిగ్రీలో అడ్మిషన్‌ తీసుకున్న విద్యార్థులు, 2017లో రీ అడ్మిషన్‌ తీసుకున్న విద్యార్థులు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా సెమిస్టర్‌–1 పరీక్ష ఫీజును మే 6వ తేదీలోగా చెల్లించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోఆర్డినేటర్‌ తూదూరు దత్తాత్రేయ తెలిపారు. రూ.500 అపరాధ రుసుంతో 14వరకు, వెయ్యి రూపాయల అపరాధ రుసుంతో 22 వరకు చెల్లించవచ్చన్నారు. సైన్స్‌ విద్యార్థులు ప్రాక్టికల్‌ ఫీజు అదనంగా చెల్లించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

పోలింగ్‌ కేంద్రాల్లో వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే
- అధికారులతో సమీక్షా సమావేశం

ఆసిఫాబాద్‌: లోకసభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఏర్పాటు చేసిన సహాయక పోలింగ్‌ కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు దీపక్‌ తివారి, దాసరి వేణుతో కలిసి ఆసిఫాబాద్‌, సిర్పూర్‌ నియోజకవర్గాల పరిధిలోని తహసీల్దార్లు, ఎన్నికల అధికారులతో ఎన్నికల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ మే 13న నిర్వహించే పార్లమెంట్‌ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఏర్పాటు చేసిన పోలింగ్‌ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్‌, ఫ్యాన్లు మూత్రశాలలు, నీడ, తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. వయోవృద్ధులు, దివ్యాంగులు, గర్భిణుల కొరకు ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ఓటరు జాబితాపై పోలింగ్‌ కేంద్రం వివరాలు, చిరునామా సరి చూసుకోవాలని, ఏవైనా తప్పులుంటే వెంటనే సరి చేయాలన్నారు. వేసవి ఉష్ణోగ్రతల దృష్ట్యా ప్రతీ పోలింగ్‌ కేంద్రంలో ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. తహసీల్దార్లు తమ పరిధిలోని ప్రతీ పోలింగ్‌ కేంద్రాన్ని సందర్శించి పూర్తి వివరాలతో నివేదిక అందజేయాలన్నారు. సెక్టార్‌ అధికారులు, బూత్‌ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లను సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో లోకేశ్వర్‌రావు, కాగజ్‌నగర్‌ ఆర్డీవో కాశబోయిన సురేశ్‌, జిల్లాలోని తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ అనుభవంతో పార్టీని బలోపేతం చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్‌ కొత్తపల్లి శ్రీనివాస్‌

ఆసిఫాబాద్‌: నాలుగు దశాబ్దాల అనుభవంతో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్‌ కొత్తపల్లి శ్రీనివాస్‌ అన్నారు. జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ అరిగెల మల్లికార్జున్‌ సోదరులు, ఇతర నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరిన నేపథ్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని 'అరిగెల' నివాసంలో సిర్పూర్‌ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, బీజేపీ నాయకులతో కలిసి గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గోడం నగేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. అరిగెల సోదరుల చేరికతో పార్లమెంటులో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకున్న కాంగ్రెస్‌ చతికిలపడిందని విమర్శించారు. ఆరు గ్యారంటీలు పూర్తిస్థాయిలో అమలుకావడం లేదన్నారు. జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ బీజేపీలో క్రమశిక్షణ, బీఆర్‌ఎస్‌లో క్రమశిక్షణారాహిత్యం ఉందన్నారు.బీఆర్‌ఎస్‌లో ఏకఛత్రాధిపత్యంతో పాటు కుటుంబ పాలన కొనసాగుతుండగా, బీజేపీలో మంత్రులకు స్వేచ్ఛ కల్పించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అరిగెల మల్లికార్జున్‌, తదితరులు పాల్గొన్నారు.



'అరిగెల'ను సన్మానిస్తున్న శ్రీనివాస్‌

మూడేళ్లకు వెలుగు చూసిన 'డెత్‌ మిస్టరీ'

- నాటువైద్యం వికటించి బాలుడు మృతి
- గుట్టుచప్పుడు కాకుండా ఆశ్రమం వెనుకాలే పాతిపెట్టిన వైనం
- తల్లి ఫిర్యాదుతో విషయం వెలుగులోకి..



సుల్వ రిషీ (ఫైల్‌)

రెబ్బెన(ఆసిఫాబాద్‌): అనారోగ్య కారణాలతో ఆశ్రమంలో చేర్పించిన బాలుడికి నాటు వైద్యం వికటించి మృతి చెందడంతో ఆశ్రమం నిర్వాహకుడు, బాలుని తండ్రితో కలిసి గుట్టుచప్పుడు కాకుండా మృతదేహాన్ని ఆశ్రమం వెనుక పాతిపెట్టగా తల్లి ఫిర్యాదుతో గురువారం విషయం వెలుగులోకి వచ్చింది. ఆసిఫాబాద్‌ డీఎస్పీ సదయ్య తెలిపిన వివరాల ప్రకారం నంబాల గ్రామానికి చెందిన సుల్వ శ్రీనివాస్‌, మల్లీశ్వరి దంపతులకు రిషీ (11), అఖిల్‌ ఇద్దరు కుమారులు. రిషీ కాళ్లకు తిమ్మిర్ల సమస్యతో బాధపడుతుండగా తండ్రి శ్రీనివాస్‌ మూడేళ్ల క్రితం పాశిగాం శివారులో ఉన్న ఆశ్రమంలో చేర్పించాడు. ఈ ఆశ్రమాన్ని అదే గ్రామానికి చెందిన బామిని భీంరావు నిర్వహిస్తున్నాడు. అనారోగ్య సమస్యలతో ఆశ్రమానికి వచ్చే వారికి నాటువైద్యం చేసేవాడు. ఈ క్రమంలో రిషీకి సైతం నాటువైద్య చేయగా వికటించడంతో మృతి చెందాడు. విషయం బయటకు పొక్కితే ఆశ్రమానికి చెడ్డపేరు వస్తుందని మృతదేహాన్ని ఆశ్రమం వెనుక భాగంలో పాతిపెట్టాడు. అప్పటికే భీంరావు మాయలో ఉన్న శ్రీనివాస్‌ సైతం అతనికి సహకరించాడు. విషయం తెలియని తల్లి మల్లీశ్వరి తన కుమారుడి కోసం పలుమార్లు భర్తను ప్రశ్నించగా మరో హాస్టల్‌లో ఉన్నాడని మభ్యపెడుతూ వచ్చాడు. భర్తపై అనుమానం వచ్చి పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆశ్రమం నిర్వాహకుడితో పాటు శ్రీనివాస్‌ను విచారించగా విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి.



బాలున్ని పాతిపెట్టిన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

లభ్యమైన అస్థికలు

తహసీల్దార్‌ జ్యోత్స్న సమక్షంలో ఆసిఫాబాద్‌ డీఎస్పీ సదయ్య, సీఐ చిట్టిబాబు, ఎస్సై చంద్రశేఖర్‌ బాలున్ని పాతిపెట్టిన స్థలంలో తవ్వకాలు జరిపించారు. 4 ఫీట్ల లోతులో అస్థికలు బయటపడడంతో మంచిర్యాలకు చెందిన ఫోరెన్సిక్‌ వైద్యుడు సురేందర్‌రెడ్డి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు తరలించారు. డీఎన్‌ఏ, ఫోరెన్సిక్‌ నివేదిక ఆధారంగా కేసు దర్యాప్తు కొనసాగుతుందని సీఐ పేర్కొన్నారు.



రోదిస్తున్న బాలుడి తల్లి మల్లీశ్వరి, కుటుంబీకులు

నేను లొంగకపోవడంతో నా బిడ్డను చంపాడు..

నామీద కన్నేసిన భీంరావు అతనికి లొంగకపోవడంతో నాకొడుకును చిత్రహింసలకు గురిచేసి పొట్టన పెట్టుకున్నాడు. నాకొడుకు నేనే మరుగుమందు పెట్టానంటూ పుకార్లు పుట్టించి ఆనెపంతో నాభర్తను రెచ్చగొట్టాడు. దీంతో నాభర్త నన్ను పలుమార్లు శారీరకంగా, మానసికంగా వేధించడంతో మానసికస్థితి సరిగా లేకుండా పోయింది.

– మల్లీశ్వరి

పోలింగ్‌ కేంద్రాలకు చేరిన ఎన్నికల సిబ్బంది

- నేడు చంద్రపూర్‌ పార్లమెంట్‌ స్థానానికి ఎన్నికలు
- ఓటు వేయనున్న సరిహద్దు గ్రామాల ప్రజలు
- 4 పోలింగ్‌ కేంద్రాల్లో 3,597 మంది ఓటర్లు

కెరమెరి(ఆసిఫాబాద్‌): తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులోని 15 గ్రామాలకు చెందిన ఓటర్లు నేడు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. మహారాష్ట్రలోని చంద్రపూర్‌ పార్లమెంట్‌ నియోజకవర్గానికి ఓటింగ్‌ చేయనున్నారు. పరంధోళి, నోకేవాడ, భోలాపటార్‌, అంతాపూర్‌ పోలింగ్‌ కేంద్రాల్లో సుమారు 3,597 మంది ఓటర్లు ఉన్నారు. పరంధోళి పోలింగ్‌ కేంద్రంలో 1,367, నోకేవాడలోని మహరాజ్‌గూడలో 370, భోలాపటార్‌లో 882, అంతాపూర్‌ పోలింగ్‌ కేంద్రంలో 978 మంది ఓటర్లు ఉన్నారు. వారంతా నేడు జరుగనున్న ఎన్నికల్లో ఓటు వేయనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రానికి ఎన్నికల అధికారులు పోలింగ్‌ కేంద్రాలకు చేరుకున్నారు. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.



పరంధోళి పోలింగ్‌ కేంద్రంలో ఎన్నికల సిబ్బంది

సాదాసీదాగా..

పది రోజులుగా కొనసాగిన ఎన్నికల ప్రచార సరళిని పరిశీలిస్తే అంతా సాదాసీదాగా సాగింది. ఎలాంటి హంగు, ఆర్భాటాలు లేకుండా ప్రచారం కొనసాగింది. తెలంగాణ ఎన్నికలతో పోల్చుకుంటే ఎంతో వ్యత్యాసం ఉందని సరిహద్దు గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఎలాంటి నజరానాలు లేకుండా కేవలం హామీలతోనే అభ్యర్థులు సరిపెట్టుకున్నారు. ఒకటి, రెండు వాహనాలతో వచ్చి అక్కడక్కడ ప్రచారం నిర్వహించారు. చంద్రపూర్‌ లోక్‌సభ స్థానానికి కేవలం ఇద్దరు అభ్యర్థులే పోటీ చేస్తున్నారు. బీజేపీ నుంచి సుధీర్‌ మునగంటివార్‌, కాంగ్రెస్‌ పార్టీ నుంచి ప్రతిభా ధానోర్‌కర్‌ పోటీలో ఉన్నారు. రెండు ప్రభుత్వాలు ఉన్నప్పటికీ అభివృద్ధి అరకొరే. రెండు రాజ్యాలకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపీలు, ఇద్దరు సర్పంచ్‌లు, ఇద్దరు ఎంపీటీసీలు ఆయా గ్రామాల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ రెండేసి రేషన్‌ కార్డులు, రెండేసి ఓటరు కార్డులు ఉన్నాయి. రెండు పాఠశాలలు, రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి.

క్లుప్తంగా

వృద్ధురాలి ఆత్మహత్య

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం బుద్ధిపల్లి గ్రామానికి చెందిన ముడిమడుగుల పోసు(68) ఆత్మహత్యకు పాల్పడింది. హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. బుద్ధిపల్లి గ్రామానికి చెందిన పోసు భర్త చిన్నయ్యతో కలిసి కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు మల్లేశ్, లచ్చయ్య, కుమార్తె బానక్క ఉన్నారు. మూడేళ్లుగా పోసు ఆరోగ్య సమస్యలతో బాధ పడుతోంది. చికిత్స తీసుకుంటున్నా ఆరోగ్య బాధ తాళలేక జీవితంపై విరక్తితో బుధవారం పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం తెల్లవారుజామున చనిపోయింది. మృతురాలి కుమారుడు మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాలకు ప్రతిపాదనలు

మంచిర్యాలటౌన్: అర్హత గల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగ ప్రతిభ కలిగిన విద్యార్థిని, విద్యార్థులకు 2024–25 విద్యా సంవత్సరానికి గాను కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్/ఎంసెట్ ఉచిత విద్యకు జిల్లాలోని అర్హత గల ప్రైవేటు కళాశాలల నుంచి ప్రతిపాదనలు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్/కరస్పాండెంట్లు తమ కళాశాల అనుమతి ధ్రువీకరణ పత్రం, సదుపాయాలు, బిల్డింగ్ ప్లాన్, అగ్నిమాపక భద్రత, గత ఐదేళ్ల ఉత్తీర్ణత శాతం వివరాలు అందించాలని తెలిపారు. కోర్సుల వివరాలు, ప్రాథమిక సౌకర్యాలు, వసతి ధ్రువపత్రాలు జతపరిచి ఈ నెల 27లోగా ఈపాస్‌లో దరఖాస్తు చేసుకుని, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తు ప్రతి, ధ్రువపత్రాలు సమర్పించాలని తెలిపారు.

మంత్రి శ్రీధర్‌బాబుకు వినతి

శ్రీరాంపూర్: రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును సింగరేణి ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు కలిశారు. అసోసియేషన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నీల బోయినకుమార్ తదితరులు హైదరాబాద్‌లో ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. సింగరేణి కార్మికులకు ఇంటి నిర్మాణం కోసం రూ.25 లక్షల వడ్డీ లేని రుణం ఇవ్వాలని, కార్మికులందరికీ ఐటీ మినహాయింపు వర్తింపజేయాలని కోరారు. సింగరేణిలో డిపెండెంట్ ఉద్యోగుల వయోపరిమితిని 35 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాలకు పెంచాలని, రిజర్వేషన్ ప్రకారం ఖాళీలను పూర్తిగా భర్తీ చేయాలని తెలిపారు. నాయకులు సురేష్, దిలీప్ పాల్గొన్నారు.

23 నుంచి సదరం శిబిరాలు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ నెల 23నుంచి సదరం శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధి కారి కిషన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదరం సర్టిఫికెట్ కాలపరిమితి ముగిసిన, రెన్యువల్, నూతనంగా సర్టిఫికెట్ కోసం మీ సేవలో స్లాట్ బుక్ చేసుకుని నిర్ణీత తేదీల్లో హాజరుకావాలన్నారు. ఈ నెల 23న కంటి చూపు(30), 24న శారీరక–ఆర్థో(50), 25న మానసిక (50), 26న మూగ, చెవుడు(50) బాధితులకు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ నెల 20న ఉదయం 8 గంటలకు స్లాట్ ఓపెన్ చేస్తారన్నారు.

మండుతున్న ఓసీపీలు

- భానుడి భగభగతో పెరిగిన ఉష్ణోగ్రతలు
- 44 డిగ్రీల వరకు నమోదు
- సతమతం అవుతున్న కార్మికులు
- క్వారీల్లో చలువ పందిళ్ల ఏర్పాటు
- షిఫ్ట్ వేళలు మార్చాలని డిమాండ్


బెల్లంపల్లి ఖైరిగూడ ఓసీపీలో గొడుగులు పంపిణీ చేస్తున్న అధికారులు


మందమర్రి కేకే ఓసీపీలో వేసిన చలువ పందిరి

శ్రీరాంపూర్: రోజురోజుకు పెరుగుతున్న ఎండలతో సింగరేణి ఓసీపీలు మండుతున్నాయి. భానుడి భగభగతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. గత కొద్ది రోజులుగా ఎండలు ముదురడంతో ఓసీపీల్లో కార్మికులు వేడికి అల్లాడుతున్నారు. బెల్లంపల్లి రీజియన్‌లోని బెల్లంపల్లి, మందమర్రి, శ్రీరాంపూర్ ఏరియాల్లో ఉన్న ఐదు ఓసీపీల్లో 20 రోజుల క్రితం 38 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తరువాత ఒక్కసారిగా పెరిగాయి. ప్రస్తుతం రీజియన్‌లోని ఓసీపీల్లో సరాసరిగా 44 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదువుతోంది. దీంతో కార్మికులు పని చేయడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వేడిగాలులు, తీవ్ర ఉక్కపోతతో అల్లాడుతున్నారు. సాధారణ ప్రాంతాలతో పోల్చితే కోల్‌మైనింగ్ ఉన్న చోట ఉష్ణోగ్రత రెండు మూడు డిగ్రీలు అధికంగా నమోదవుతుంది. ఓసీపీల్లో నల్లని కోల్ అంతా ఎక్స్‌పోజ్ అయ్యి ఉండడం, దీనికి తోడు కొన్ని భూగర్భ గనులు ఓసీపీలుగా మార్చడం వల్ల పాత పని స్థలాలు బయటపడ్డప్పుడు కోల్‌ఆక్సిడేషన్ అయ్యి అక్కడక్కడ మంటలు రావడం జరుగుతుంది. దీంతో ఓసీపీ క్వారీల్లో వేడి అధికంగా నమోదు అవుతుంటుంది. భూగర్భ గనుల్లో పనిచేసే కార్మికులకు డ్యూటీకి వచ్చి పోయేటప్పుడే తప్ప లోపలికి వెళ్లిన తరువాత ఏమాత్రం బయటి వాతావరణంతో సంబంధం ఉండదు. కానీ ఓసీపీల్లో కార్మికులంతా ఆరు బయట ఉండి పని చేయాల్సి ఉంటుంది. ఈ పరిస్థితుల్లో వీరు వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. మండుతున్న ఎండలకు విధుల్లోకి వెళ్లిన కొద్ది సేపటికి యూనిఫాం పూర్తిగా చెమటతో తడిసిపోతోందని, ఒళ్లంతా వేడెక్కుతోందని కార్మికులు వాపోతున్నారు. ఉదయం 11 గంటలకే భానుడు ప్రతాపం చూపెడుతున్నాడని పేర్కొంటున్నారు. కొన్ని ఓసీపీల్లో పని స్థలాల వద్ద అక్కడక్కడ రెస్టు షెల్టర్లు ఉన్నా ఏమాత్రం ఉపశమనం కలిగించలేకపోతున్నాయి. ఉదయం షిఫ్ట్ ఉద్యోగుల కంటే సెకండ్ షిఫ్ట్ ఉద్యోగులు అధికంగా ఎండ తీవ్రతకు గురవుతున్నారు. ప్రతీ వేసవిలో కంపెనీ ఉపశమన చర్యలు చేపడుతుంది. ఈసారి ముందే ఎండలు మండుతున్నందున యాజమాన్యం వేసవి ఉపశమన చర్యలు మరిన్ని చేపట్టాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఎండల తీవ్రత పెరిగితే కార్మికుల హాజరు శాతంపై ప్రభావం చూపే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

పని వేళలతో పరేషాన్..

ప్రస్తుత పనివేళలతో వేసవిలో ఉద్యోగులు పరేషాన్ అవుతున్నారు. ఓసీపీల్లో ఎండ తీవ్రత దృష్ట్యా షిఫ్ట్ వేళలు మార్చాలని కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. సాధారణ రోజుల్లో ఫస్ట్‌షిఫ్ట్ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, సెకండ్ షిఫ్ట్ మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఉంటుంది. ప్రతీ వేసవిలో ఎండల తీవ్రత పెరిగితే షిఫ్ట్ వేళలను కంపెనీ మార్చుతుంది. ఉదయం షిఫ్ట్‌ను ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, సెకండ్ షిఫ్ట్‌ను సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 12గంటలకు మార్చుతారు. ఈ వేళలను తక్షణమే అమలు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా కార్మికులకు ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లను కంపెనీ పంపిణీ చేస్తుంది. శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్సార్పీ ఓసీపీ, ఇందారం ఓసీపీల్లో మూడు రోజుల నుంచి ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇస్తున్నా మజ్జిగ ఆదివారం నుంచే ఇస్తున్నారు. బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ, మందమర్రి ఏరియాలోని కేకే ఓసీపీ, ఆర్కేపీ ఓసీపీల్లో కూడా వీటిని పంపిణీ చేస్తున్నారు. ఖైరిగూడ ఓసీపీలో ఉద్యోగులకు గొడుగులు, కూల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. ఇప్పటివరకు క్వారీలో వేసిన చలువ పందిళ్లు సరిపోవని, మరిన్ని చలువ పందిళ్లు తాము పని చేసే చోట సమీపంలోనే ఏర్పాటు చేయాలని కార్మికులు కోరుతున్నారు. అన్ని డంపర్లు, షవల్స్‌లో ఏసీలు పుల్ కండీషన్ చేయాలని ఆపరేటర్లు కోరుతున్నారు.

కాంట్రాక్ట్ కార్మికులవి ప్రాణాలు కావా...?

ఓసీపీలు, ఇతర ఉపరితల డిపార్టుమెంట్లలో పని చేసే కాంట్రాక్ట్ కార్మికులను యాజమాన్యం పట్టించుకోవడం లేదు. వారికి కూడా పర్మినెంట్ కార్మికులకు ఇస్తున్నట్లుగా మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఓసీపీల్లో చాలామంది కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారు. వారు కూడా ఎండవేడితో వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. తమవి కూడా ప్రాణాలేనని వారు వాపోతున్నారు. తమకు కూడా మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని కోరుతున్నారు.

తక్షణమే వేళలు మార్చాలి

ఓసీపీల్లో షిఫ్ట్ వేళలను తక్షణమే మార్చాలి. ఇప్పటికే ఎండలు మండుతున్నాయి. దీనిపై కార్పొరేట్ అధికారులు నిర్ణయం తీసుకొని ఏరియాలకు ఆదేశాలివ్వాలి. ఓసీపీ ఇతర సర్ఫేస్ డిపార్టుమెంట్లలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు కూడా మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలి.
–ఎస్కే బాజీసైదా, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచీ కార్యదర్శి

'కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలి'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

కాగజ్‌నగర్ రూరల్: అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే హరీశ్‌బాబు బహిరంగ లేఖ రాశారు. గురువారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల వద్ద మంత్రి సీతక్క పేరు చెప్పి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. పట్టణానికి చెందిన ఒక మహిళా వైద్యురాలిని బెదిరించి రూ.10 లక్షలు డిమాండ్ చేశారన్నారు. లోకసభ ఎన్నికల ఫండ్ పేరిట, సీతక్కకు వాటా ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొంటూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న కోనేరు కోనప్ప, రావి శ్రీనివాస్‌లపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. మంత్రి సీతక్క పేరును వాడుకుంటూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకులు గోలెం వెంకటేశ్, సిర్పూర్ అసెంబ్లీ కన్వీనర్ గొల్లపల్లి వీరభద్రచారి, జిల్లా కోశాధికారి అరుణ్‌లోయా, పట్టణ అధ్యక్షుడు సిందం శ్రీనివాస్, జిల్లా దళిత మోర్చా నాయకులు ఈర్ల విశ్వేశ్వర్, కొప్పుల శంకర్, సత్పుతె తుకారాం, పవన్ పురోహిత్, మామిడి బాలాజీ, మోహన్, భీమేశ్, జనార్దన్, సంతోశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై ఫిర్యాదు

కాగజ్‌నగర్‌రూరల్: అసత్యపు ఆరోపణలు చేసిన ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ గురువారం పట్టణ సీఐకి ఫిర్యాదు చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పేరు చెప్పి మహిళా వైద్యురాలిని బెదిరించి ఎన్నికల ఫండ్ పేరిట రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారని, రియల్ ఎస్టేట్ వ్యాపారుల వద్ద లక్షల రూపాయలు అక్రమంగా వసూలు చేసినట్లు అసత్యపు ఆరోపణలు చేశారన్నారు. తనను అవమానపరిచే విధంగా మాట్లాడిన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వడ్డీ వ్యాపారుల ఇళ్లపై పోలీసుల దాడి


సోదాలు చేస్తున్న పోలీసులు

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలో అక్రమ వడ్డీ వ్యాపారుల ఇళ్లు, కార్యాలయాలపై గురువారం డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో మూడు టీంలుగా ఏర్పడి దాడులు నిర్వహించారు. పెద్దవాగు రోడ్డులోని సురేందర్ సితాని ఇంట్లో ప్రామిసరీనోట్లు, నాన్‌జ్యూడిషియల్ బాండ్లు, నాలుగు బ్లాంక్ చెక్కులతో పాటు రూ.1,43,250 నగదు, దుర్గానగర్‌లోని జుగల్ కిశోర్‌లోయా ఇంట్లో రూ.28 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శంకరయ్య తెలిపారు. అమాయక ప్రజల నుంచి అధికశాతం వడ్డీ వసూలు చేస్తూ వారిని వేధిస్తుండటంతో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

వడదెబ్బతో ఇద్దరు మృతి


మధుకర్(ఫైల్)

మంచిర్యాలక్రైం: వడదెబ్బతో వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మృతిచెందారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఎక్బాల్ హైమద్ నగర్‌కు చెందిన ఎస్‌కే.ఫరీద్ పాష(40) వడదెబ్బతో చనిపోయాడు. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫరీద్ పాష ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తూ జీవనం సాగించేవాడు. కొంతకాలంగా అధికంగా మద్యం సేవించి అనారోగ్యానికి గురయ్యాడు. గురువారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఫరీద్ మధ్యాహ్నం స్థానిక ఎస్‌బీఐ ఎదుట పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఫరీద్ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కౌటాల మండలంలో..

కౌటాల: కౌటాల మండలం తుమ్మిడిహెట్టి గ్రామ పంచాయతీ పరిధి జనగాం గ్రామానికి చెందిన వేలాది మధుకర్(24) వడదెబ్బ తగిలి బుధవారం రాత్రి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మధుకర్‌కు చెందిన ఎద్దు ఈ నెల 14న తప్పిపోయింది. జాడ వెతికేందుకు మధుకర్ గత మూడు రోజులుగా ఎండలోనే సమీప గ్రామాలు, వ్యవసాయ చేనుల్లో తిరిగాడు. బుధవారం సాయంత్రం ఇంటి వద్ద మధుకర్‌కు వాంతులు, విరేచనాలు కావడంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలిస్తుండగా బుధవారం రాత్రి మార్గమధ్యంలో మృతిచెందాడు. మధుకర్‌కు తల్లిదండ్రులు కమలాబాయి, ధర్మరావు ఉన్నారు.

కేటీఆర్‌ను కలిసిన టీబీజీకేఎస్ నాయకులు

శ్రీరాంపూర్: టీబీజీకేఎస్ నాయకులు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.రామారావును గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. టీబీజీకేఎస్ స్టీరింగ్ కమిటీ చైర్మన్ మిర్యాల రాజిరెడ్డితోపాటు అన్ని డివిజన్ల ముఖ్య నేతలు ఆయనను కలిసి సింగరేణిలో యూనియన్ బలోపేతం, కార్మికుల సమస్యలపై చర్చించారు. టీబీజీకేఎస్ యూనియన్ ఇక నుంచి బీఆర్ఎస్‌కు అనుబంధంగా కొనసాగుతుందని తెలిపారు. సింగరేణిలో కార్మికులకు అనేక హక్కులు సాధించి పెట్టామని, కార్మికుల్లో యూనియన్‌కు బలమైన ముద్ర ఉందని, దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని కేటీఆర్ సూచించారు. ఈ భేటీలో పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, నాయకులు నూనె కొమురయ్య, పెట్టం లక్ష్మణ్, బండి రమేశ్, పానుగంటి సత్తయ్య, అన్వేశ్‌రెడ్డి, పొగాకు రమేశ్ పాల్గొన్నారు.

స్వంత గూటికి సురేందర్‌రెడ్డి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా టీబీజీకేఎస్ మాజీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి తిరిగి స్వంత గూటికి చేరనున్నారు. గత గుర్తింపు సంఘం ఎన్నికల ముందు టీబీజీకేఎస్‌ను వీడి ఐఎన్టీయూసీలో చేరారు. ఆ యూనియన్‌లో సరైన గుర్తింపు లేకపోవడం, టీబీజీకేఎస్ నుంచి ఆహ్వానం రావడంతో శుక్రవారం తిరిగి టీబీజీకేఎస్‌లో చేరనున్నారు. పెద్దపల్లిలో ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా పెద్దపల్లికి వస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో తిరిగి టీబీజీకేఎస్ కండువా కప్పుకోనున్నారు.

ఐఎన్టీయూసీ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లోని ఎస్సార్పీ 3 గనిలో ఐఎన్టీయూసీ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు మాట్లాడుతూ కార్మికులకు ఐఎన్టీయూసీ అనేక హక్కులు సాధించిన చరిత్ర ఉందన్నారు. ఈ నెల 21న గోదావరిఖనిలో సెంట్రల్ మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆర్కే 7 గనిలో యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు భీంరావు, గరిగే స్వామి, ఫిట్ సెక్రెటరీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఎస్సార్పీ 3 గనిలో యూనియన్ బ్రాంచీ కార్యదర్శి ఫిట్స్ సెక్రెటరీలు శ్రీను, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఒకరికి గాయాలు


గాయాలపాలైన విక్రు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని బూర్గుడ సమీపంలో రాష్ట్రీయ రహదారిపై అదుపుతప్పి ఆటో బోల్తా పడిన ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. మండలంలోని అప్పపల్లి గ్రామానికి చెందిన ఆటో ఆసిఫాబాద్ నుంచి అప్పపల్లికి వెళ్తుండగా బూర్గుడ సమీపంలో అడ్డువచ్చిన ఎద్దును ఢీకొని ఆటో బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న చునర్కర్ విక్రుకు గాయాలు కావడంతో స్థానికులు 108లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

డివైడర్‌ను ఢీ కొన్న కారు

మంచిర్యాల నుంచి ఆసిఫాబాద్‌కు వస్తున్న కారు మోతుగూడ సమీపంలో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు.

21న ఐఎన్టీయూసీ మహాసభ

మందమర్రిరూరల్: ఈ నెల 21న గోదావరిఖనిలో నిర్వహించే ఐఎన్టీయూసీ మహాసభను సింగరేణి కార్మికవర్గం విజయవంతం చేయాలని ఆ సంఘం సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కాంపెల్లి సమ్మయ్య కోరారు. గురువారం ఏరియాలోని ఐఎన్టీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సమ్మయ్య మాట్లాడారు. కార్మికుల సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఐఎన్టీయూసీ మందమర్రి బ్రాంచ్ ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య, నాయకులు నరేందర్, సూర్యనారాయణ, లక్ష్మణ్ తిరుపతి, రాజన్న, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

అవార్డుకు ఎంపిక

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌కు చెందిన జేసీఐ మంచిర్యాల జిల్లా కన్వీనర్ ఆరుముల్ల రాజు బూస లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ అవార్డుకు ఎంపికయ్యారు. కమ్యూనిటీ డెవలప్‌మెంట్, పబ్లిక్ రిలేషన్స్, ఇతర సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందున్నందుకు గాను ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు సంస్థ చైర్మన్ బూస ప్రదీప్, కోఆర్డినేటర్ దేవిలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో ఈ అవార్డును అందించనున్నట్లు తెలిపారు.

నేడు కార్యదర్శుల సమావేశం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ బి.సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈజీఎస్‌పై కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. పంచాయతీ ప్రణాళిక, క్షేత్ర సహాయకులతో తయారు చేసిన అభివృద్ధి పనుల నివేదిక, గ్రామసభలు నిర్వహించి పనులు ఆమోదించడం, జాబ్‌కార్డుల అప్‌గ్రేడ్, కొత్త జాబ్ కార్డు కోసం దరఖాస్తులు తీసుకోవడం, ఉపాధి కూలీలు పనులకు వచ్చేలా చైతన్యం చేయడం, ఏడు రిజిస్టర్ల నిర్వహణ, వారాంతపు సమావేశాల నిర్వహణ తదితర వాటిపై పూర్తి స్థాయి సమీక్ష ఉంటుందని తెలిపారు. సమావేశానికి కార్యదర్శులు తాజా నివేదికలతో హాజరు కావాలని తెలిపారు.

మృతుడి ఆచూకీ లభ్యం

మంచిర్యాలక్రైం: ఈ నెల 16న స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో మృతిచెందిన వ్యక్తి ఆచూకీ లభ్యమైంది. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానికుల సమాచారం మేరకు బస్టాండ్‌లో పరిశీలించగా వ్యక్తి మృతిచెంది ఉన్నాడు. ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపర్చారు. పత్రిక ప్రకటనల ఆధారంగా మృతుడి బంధువులు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించారు. మృతుడిని పెద్దపల్లి జిల్లా గౌరెడ్డిపేట్ గ్రామానికి చెందిన కొమ్ము రాజేందర్‌గా గుర్తించారు. వ్యవసాయ పనులు చేస్తూ జీవించేవాడు. తన స్నేహితుడిని కలిసేందుకు మంచిర్యాలకు వచ్చి బస్టాండ్‌లో చనిపోయాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అట్టహాసంగా ఫుట్‌బాల్ పోటీలు


పోటీలు ప్రారంభిస్తున్న జీఎం రవిప్రసాద్

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో గురువారం వేణుగోపాల్ మెమోరియల్ ఫుట్‌బాల్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. హైదరాబాద్, కామారెడ్డి, ఆసిఫాబాద్, కరీంనగర్, మంచిర్యాల, బెల్లంపల్లి, చంద్రపూర్, వరంగల్, ఖమ్మం, తదితర ప్రాంతాల నుంచి క్రీడాకారులు తరలివచ్చారు. బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తోందన్నారు. యాజమాన్యం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని క్రీడాకారులు పోటీల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం తిరుమల్‌రావు, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, పీవో ఉమాకాంత్, పర్సనల్ మేనేజర్ రెడ్డి మల్ల తిరుపతి, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మురహరిరావు, తదితరులు పాల్గొన్నారు.

'రైతులకు అండగా ప్రేమ్‌సాగర్‌రావు'


జలాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు

దండేపల్లి: రైతులకు ఇబ్బందులు కలుగకుండా మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అండగా నిలిచి ఆదుకుంటున్నారని కాంగ్రెస్ నాయకులు, రైతులు అన్నారు. మండలంలోని తానిమడుగు సమీపంలో గూడెం ఎత్తిపోతల డెలివరీ పాయింట్ వద్ద కడెం ప్రధాన కాల్వలో పలువురు రైతులు, కాంగ్రెస్ నాయకులు ప్రేంసాగర్‌రావు చిత్రపటానికి గురువారం జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కడెం ఆయకట్టు కింద యాసంగిలో డీ–30నుంచి డీ–42 వరకు దండేపల్లి మండలంలోని గూడెం సత్యనారాయణస్వామి ఎత్తిపోతల ద్వారా జనవరి 6నుంచి ఏప్రిల్ 3వరకు నిరంతరాయంగా సాగునీరు అందించారని తెలిపారు. ప్రస్తుతం ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటిమట్టం తక్కువ ఉన్నా రైతులు నష్టపోకుండా ఉండేందుకు నీరందిస్తున్నారని తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డికి రైతుల పోస్టుకార్డులు


పోస్టుకార్డులు చూపిస్తున్న రైతులు

చెన్నూర్: ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన రైతులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డులు రాశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నేటికీ అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వరి ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లించాలని, రైతు భరోసా ద్వారా రూ.10 వేలు కాకుండా రూ.15 వేలు ఇవ్వాలని తెలిపారు. రూ.2 లక్షల రైతు రుణామాఫీ వెంటనే చేయాలని, రైతు కూలీలకు రూ.12 వేలు చెల్లించాలని పేర్కొన్నారు. రైతులు పోస్టుకార్డుల ఉద్యమానికి బీఆర్ఎస్ నాయకులు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లెల దామోదర్ రెడ్డి, ఎంపీపీ మంత్రి బాపు, జెడ్పీటీసీ మోతె తిరుపతి, బీఆర్ఎస్ నాయకులు బుర్ర రాకేశ్, శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.

బస్సును వెంబడించి ఎక్కించారు..


బస్సులో ఎక్కించిన హోంగార్డు నీలయ్య

జన్నారం: హైదరాబాద్‌లో శిక్షణకు వెళ్తున్న నిరుద్యోగి జన్నారం బస్టాండ్‌లో బస్సు తప్పిపోగా బ్లూకోల్ట్స్ సిబ్బంది మోటార్‌సైకిల్‌పై వెంబడించి ఎక్కించారు. వివరాలిలా ఉన్నాయి. ఉట్నూర్‌కు చెందిన సీహెచ్.పృథ్వీరాజ్ శిక్షణ కోసం బుధవారం రాత్రి చివరి బస్సులో హైదరాబాద్‌కు బయల్దేరాడు. జన్నారం బస్టాండ్‌లో రాత్రి 11 గంటలకు బస్సు ఆగడంతో మూత్రవిసర్జనకు వెళ్లాడు. డ్రైవర్ గమనించకుండా బస్సును అక్కడి నుంచి హైదరాబాద్ వైపు పోనిచ్చాడు. బస్సు వెళ్లిపోవడంతో పృథ్వీరాజ్ ఆందోళనకు గురయ్యాడు. అక్కడే ఉన్న బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ శ్రీనివాస్, హోంగార్డు నీలయ్య తమ మోటార్‌సైకిల్‌పై ఎక్కించుకుని బస్సును వెంబడించారు. పది కిలోమీటర్ల దూరం వెళ్లాక చింతగూడ గ్రామ సమీపంలో బస్సును ఆపి అందులో ఎక్కించారు. పృథ్వీరాజ్ లగేజీ, బట్టలు, పుస్తకాలు అన్ని బస్సులోనే ఉన్నాయి. సమయానికి సహాయం అందించిన వారిని ప్రయాణికులు అభినందించారు.